
# ప్రజాశక్తి

సోమవారం 15 జనవరి 2024 5

విజయనగరం

## భోగి సందడి



జిల్లాలోని గ్రామాల్లో, పట్టణాల్లో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. ఆదివారం భోగి పండగను ప్రజలంతా ఆనందంగా జరుపుకున్నారు భోగి మంటలు వేసి, సందడి చేశారు. ఉదయం నాలుగు గంటల నుంచి భోగి మంటల్లో చలికాగుతూ భోగి పల్లు వేస్తూ, చుట్టూ డాన్సులు వేస్తూ సంతోషంగా గడిపారు.

– ప్రజాశక్తి, విజయనగరంటౌన్

# సంక్రాంతి వచ్చిందే తుమ్మెద

## సర్కారుకు పట్టని సంబరాలు



***పండగ అంటేనే సరదాలు.. సందళ్లు... అందులోనూ సంక్రాంతి అంటే తెలుగు వారింట చెప్పలేనంత అనుభూతి. స్నేహితులు, రక్త సంబంధీకుల అనురాగం. ఆప్యాయత పంచుకునే పర్వదినాలు. పండగకు కొద్దిరోజుల ముందు నుంచే పిండివంటకాలు ఘుమఘుమ లాడేవి. నూతన వస్త్రాలు, కిరాణా సామగ్రి తదితర సరుకుల క్రయ విక్రయాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కళకళలాడేది. ఇదంతా ఒకప్పటి మాట. మారిన ప్రభుత్వ విధానాల వల్ల నేడా పరిస్థితులు పెద్దగా కనిపించడం లేదు. పేద, మధ్య తరగతి ప్రజానీకమే కాదు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం సమస్యలతో సతమతమౌతూ పండగ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఏటా సర్కారు జిల్లా కేంద్రంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించేది. ఈసారి అది కూడా కానరాకపోవడంతో మునుపటితో పోలిస్తే సంక్రాంతి సందడి ఒకింత తగ్గిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.***

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

సంక్రాంతికి నెలరోజుల ముందే.... అంటే నెలగంటు పెట్టినప్పటి నుంచీ రోజూ క్రమం తప్పకుండా ఇళ్లు అలుక్కోవడం (శుభ్రం చేసుకోవడం), సున్నాలు వేసి ప్రత్యేకంగా ముస్తాబు చేయడం వంటి పనులు ప్రారంభిస్తారు. రకరకాల పూలు, రంగులతో ఇళ్ల ముందు వేసిన ముగ్గులు హరివిల్లును తలపించేవి. గొబ్బెమ్మలు పెడుతూ యువతంతా ఆటపాటలతో అలికిరి చేసేవారు. బుడబుక్కల వాళ్లు, హరిదాసులు, కొమ్మ దాసులు... కళలను ప్రదర్శించేవారు. బట్టల వ్యాపారులు సైకిళ్లపై గ్రామగ్రామాల్లో తిరిగి విక్రయించేవారు. ఇలా గ్రామసీమలు కళకళలాడేవి. ఇదంతా ఒకప్పటి మాట. నేడు ఆ పరిస్థితులు మారాయి. మారుతున్న పరిస్థితులు నాటి సంస్కృతీ సంప్రదాయాలను కనుమరుగు చేస్తున్నాయి. ఏటా పండగ తీరు మారుతుండడమే ఇందుకు నిదర్శనం.

పూర్వం ప్రభుత్వం తరపున సంక్రాంతి కానుకలు అందేవి. పండక్కి ఒక్కరోజు ముందే జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వం తరపున సంక్రాంతి సంబరాలు నిర్వహించేవారు. ఈ సంబరాలతోనే పండగ సందడి ప్రారంభమయ్యేది. నేడు ప్రభుత్వం నుంచి అటువంటి సహకారం, అనుభూతి కరువైంది. దీనికితోడు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్కీమ్‌వర్కర్లు పుట్టెడు దు:ఖంతో ఆందోళనబాటలో ఉన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేదు. చేతికందిన పంట దోపిడీకి గురౌతోంది. అరకొరగా విక్రయించిన ధాన్యం డబ్బులు కూడా చేతికందలేదు. పేద, మధ్య తరగతి ప్రజలు పెరిగిన ధరలను అందుకోలేని పరిస్థితి. సగటు ప్రజానీకం పండగపూట కూడా వంటకాలు ఆరగించి, కొత్తబట్టలు ధరించే పరిస్థితి లేకుండా పోయింది. సంక్రాంతిని మన ప్రాంతంలో పూర్తిగా వ్యవసాయ పండగగా భావిస్తారు. అందుకు తగ్గట్టే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 70 శాతం వ్యవసాయ కుటుంబాలే. పంటలసాగు, క్రయ, విక్రయాలతోనే వీరికి సంక్రాంతి పండగ ముడిపడి ఉంటుంది. ఈ ఏడాది వర్షాలు పెద్దగా అనుకూలించకపోయినా, అష్టకష్టాలు పడి, అధిక పెట్టుబడులతో సాగుచేశారు. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా ధరలు పెంచలేదు. పెంచిన అరకొర ధరలకు అనుగుణంగానూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయలేదు. తూకంలో తేడా, ధరలో దగా జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. విక్రయించిన ధాన్యానికి డబ్బులు సకాలంలో డబ్బులు ఇవ్వలేదు. ఇప్పటికీ వేలాది మంది ధాన్యం రైతులకు రూ.కోట్లలో బకాయి ఉంది. ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంతో రైతుల ఇబ్బందులు ఎప్పటి మాదిరిగానే ఉన్నాయి. పండక్కి పక్షం రోజుల ముందే ధాన్యం, ఇతరత్రా వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించి, కొత్తబట్టలు, సంక్రాంతి సరుకులు కొనుక్కునే నాటి పరిస్థితులు నేడు పూర్తిగా తలకిందులయ్యాయి. గంగిరెద్దులు, హరిదాసులు గ్రామాలు, పట్టణాల్లో తిరుగుతున్నా రైతాంగం పుట్టెడు కష్టాల్లో ఉండడం వల్ల వారికి మునుపటి ఆదరణ దక్కడం లేదు. ప్రజల్లోనూ ఇటువంటి ఉత్సాహం తగ్గింది.



టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

# మార్కెట్ కళకళ



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ఎంజి రోడ్డు

ప్రజాశక్తి–విజయనగరంటౌన్

సంక్రాంతి పండగ నేపథ్యంలో ఆదివారం నగరంలో మార్కెట్ కళకళలాడింది. వస్త్ర మార్కెట్‌తోపాటు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసే గంటస్తంభం మార్కెట్, కిరాణాషాపులు, వంట నూనె షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో ఎటు చూసినా ఇసుక వేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. మార్కెట్‌లో అడుగుపెట్టాలంటే.. పెద్దచెరువు గట్టు, సత్యలాడ్జి, రాజీవ్ క్రీడా మైదానం వద్ద వాహనాలు విడిచిపెట్టి లోపలికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఎటు చూసినా కొనుగోలుదారులతో మార్కెట్ నిండిపోవడంతో గంటల కొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో కొన్నిచోట్ల పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

## భోగి మంటల్లో

# జిఓ 2 ప్రతులు దహనం

**పండగపూటా నిరసనలు కొనసాగించిన అంగన్వాడీలు ● 34వ రోజుకు నిరవధిక సమ్మె**

ప్రజాశక్తి–శృంగవరపుకోట

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన జిల్లాలో చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 34వ రోజూ కొనసాగింది. పండగ పూటా అంగన్వాడీలు నిరసనలు కొనసాగించారు. అంగన్వాడీల సమ్మెను అణచివేసేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్మా జిఓ 2 ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. శృంగవరపుకోట పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ఆదివారం భోగి సందర్భంగా భోగి మంటల్లో జిఓ 2 ప్రతులను వేశారు. అంగన్వాడీల ఆందోళనకు సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ పూటా అంగన్వాడీలు రోడ్డెక్కే పరిస్థితిని ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్మా జిఓ 2ను వెంటనే రద్దు చేయాలన్నారు. అంగన్వాడీలపై వేధింపులు, బెదిరింపులు ఆపి, తక్షణమే వారి డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి, అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుంటే, వచ్చే ఎన్నికల్లో అక్కచెల్లెమ్మల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.శ్యామల, డిజె లక్ష్మి, వి.మాణిక్యం, బి.సుశీల, తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట.. భోగి మంటల్లో జిఒ 2 ప్రతులను వేసి దహనం చేస్తున్న అంగన్వాడీలు

**జామి :** మండల కేంద్రమైన జామిలో అంగన్వాడీలు భోగి మంటల్లో జిఒ 2 కాపీలను దహనం చేశారు. అంగన్వాడీ యూనియన్ మండల నాయకులు కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

# పండగ పూట పస్తులు

**● నిలువునా మోసపోయిన పంప్‌హౌస్ కార్మికులు ● మాటిచ్చి జీతాలివ్వని ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టరు**



మున్సిపల్ కార్యాలయం వద్ద రాత్రిపూట నిద్రిస్తున్న పంప్‌హౌస్ కార్మికులు (ఫైల్)

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

విజయనగరం నగర ప్రజానీకానికి తాగునీరు అందిస్తున్న ముషిడిపల్లి, నెల్లిమర్ల, సారిపల్లి మాస్టర్ పంప్ హౌస్ కార్మికులు పండగ పూట పస్తులుండాల్సి వచ్చింది. వారికి నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో ఆకలితో పండగ జరుపుకోవాల్సిన దుస్థితి నెలకొంది. నగరంలో వాటర్ వర్క్స్ కార్మికులు 73 మంది ఉన్నారు. వారిలో అమృత పథకం కింద పని చేస్తున్న 24 మందికి 5 నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదు. నెల్లిమర్ల పంప్‌హౌస్‌లోని 29 మంది కార్మికులకు 3 నెలలు, ముషిడిపల్లి పంప్‌హౌస్‌లో పనిచేస్తున్న 20 మంది కార్మికులకు 2 నెలల జీతాలు చెల్లించాల్సి ఉంది. రాష్ట్ర ప్రజలకు ఏడాదిలో అతిపెద్ద పండగ సంక్రాంతి. అటువంటి పండగ పూట విజయనగరంలో వాటర్ వర్క్స్ కార్మికులు ఆకలితో అలమటించే పరిస్థితిని నగరపాలక సంస్థ, ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టరు కల్పించారు. వేతనాల కోసం బోగి ముందు రోజు వరకు రాత్రి, పగలు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు పండగ కాబట్టి కనీసం ఒక్క నెల వేతనం వేయించే ఏర్పాటు చేస్తామని చెప్పి... మిన్నకుండిపోయారు. శుక్రవారం సాయంత్రం నుంచి అధికారులు అందుబాటులో లేకపోవడంతో కార్మికులు వేతనం కోసం ఎదురుచూపులు చూస్తూ వెనుదిరగాల్సిన దుస్థితి నెలకొంది. తక్షణమే జీతాలు చెల్లించకపోతే పంపింగ్ నిలుపుదల చేస్తామని హెచ్చరించినా వారికి వేతనాలు చెల్లించలేదు. పండగ పూట కూడా పిల్లలకు కనీసం మంచి భోజనం పెట్టలేని పరిస్థితిలో ఉన్నామంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల తీరుపై ఆగ్రహం**

పండగ పూట జీతాలు చెల్లించకుండా కార్మికులను, వారి కుటుంబాలను పస్తులు ఉంచడంపై నగర ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులకు కూడా జీతాలు ఇవ్వకపోతే ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని చెబుతున్నారు. మరోవైపు పంప్ హౌస్ కార్మికులకు 2023 జూన్‌లో పెరిగిన రూ.2 వేలు వేతనం కూడా చెల్లించలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

### మీకు జీతాలు రాకుంటే?

మాకు ఏడాదిలో అతిపెద్ద పండగ సంక్రాంతి. అటువంటి పండగకు ఇవ్వాల్సిన వేతనాలు ఇవ్వకపోవడం దారుణం. అదే మీకు వేతనాలు రాకపోతే ఇలాగేనా ఉంటారు?. పండగకు బట్టలేవని పిల్లలు అడిగితే సమాధానం చెప్పలేని దీన స్థితిలో ఉన్నాం. పండగకు పిండి వంటల కోసం సరుకులకు డబ్బులు ఇవ్వాలని నా భార్య అడిగితే సమాధానం చెప్పలేక కంటతడి పెట్టాల్సిన దుస్థితి రావడానికి కారణం కార్పొరేషన్ అధికారులే.

– కోరాడ సన్యాసిరావు, పంప్ హౌస్ కార్మికుడు

### ఇది మీకు భావ్యమా?

వాటర్ వర్క్స్ కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం కార్పొరేషన్ అధికారులకు భావ్యమేనా?. వేతనాలు ఇవ్వకుంటే కుటుంబంతో ఎలా బతుకుతారు? రెండు రోజుల పాటు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపితే, ఎంతో కొంత వేతనం వేయిస్తామని చెప్పిన అధికారులు కనీసం పట్టించుకోకపోవడం దారుణం.

– ఎ.జగన్మోహన్, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు

# విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలతో అతిథులు కోలగట్ల శ్రావణి, నటి పూజమూర్తి, గణపతినీడి శ్రీనివాసరావు, తదితరులు

ప్రజాశక్తి–విజయనగరం కోట

వాజీ చానల్ ఆధ్వర్యాన నిర్వహించిన రంగోలీ, మెగా హౌసీ లక్కీ డ్రా విజేతలకు ఆదివారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో బహుమతులు ప్రదానం చేశారు. వాజీ చానల్ ఎమ్‌డి గణపతినీడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి విజేతలకు బహుమతులు అందించారు. మహిళలలో ఉన్న సామర్థ్యాన్ని వెలికి తీయడమే కాక, సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించేలా కృషి చేస్తున్న శ్రీనివాసరావును డిప్యూటీ మేయర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి గుండమ్మ కథ సీరియల్ ఫేమ్ పూజ మూర్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నర్తనశాల, అమృత శ్రీ వర్షిణి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె.ఎ.నాయుడు, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'పిఎం జన్‌మన్'పై ముఖాముఖి

**విజయనగరం :** కేంద్ర ప్రభుత్వం పివిటిజిల కోసం ప్రారంభించిన పిఎం జన్‌మన్ కార్యక్రమం అమలుపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ సోమవారం.. గిరిజనులతో ఆన్‌లైన్ ద్వారా ముఖాముఖిలో పాల్గొంటున్నారు. దేశంలో ఎనిమిది జిల్లాలకు చెందిన పివిటిజి గిరిజనులతో ప్రధానమంత్రి ముఖాముఖి నిర్వహిస్తారని, జిల్లాలో గంట్యాడ మండలం డెప్పూరు గిరిజన గ్రామంలో ప్రత్యక్ష ప్రసారం వీక్షించే ఏర్పాట్లు చేశామని గిరిజన సంక్షేమాధికారి టి.చంద్రశేఖర్ రావు చెప్పారు గిరిజన సహకారసంస్థ, గృహనిర్మాణ శాఖ, స్త్రీశిశు సంక్షేమశాఖ, వైద్య ఆరోగ్యం, వికసిత్ భారత్‌లకు సంబంధించిన స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఈ కార్యక్రమం ప్రసారమవుతుందని తెలిపారు.

## సంక్రాంతి కానుకలు పంపిణీ

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

కొత్తపేటలోని సంపత్ వినాయక ఆలయం వద్ద ఆదివారం ఆలయ ధర్మకర్త యడ్ల పైడిరాజు ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన సంక్రాంతి కానుకలు, చీరలను చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షులు సిరి సహస్ర పంపిణీ చేశారు. ముందుగా ఆలయాన్ని ఆమె సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తోట వాసు, సెక్రటరీ జాకీర్ హుస్సేన్, శివ రామకృష్ణ, శ్రీనివాస్, రమేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లే ఇవ్వలేదు.. రుణం చెల్లించాలట

**● టిడ్కో ఇళ్లు అప్పగించకుండానే బ్యాంకు నోటీసులు**
**● రుణాలు చెల్లించాలని లబ్ధిదారులకు మెసేజులు**
**● ఆందోళన చెందుతున్న పేదలు**




బొబ్బిలిలో టిడ్కో ఇళ్ల సముదాయం

ప్రజాశక్తి–బొబ్బిలి

టిడిపి హయాంలో మంజూరైన టిడ్కో ఇళ్లను వైసిపి ప్రభుత్వం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంలో విఫలమైంది. పట్టణ పేదల కోసం టిడిపి హయాంలో రామన్నదొరవలస సమీపంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం ప్రారంభించింది. ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో 2019లో అధికారం చేపట్టిన వైసిపి పూర్తిగా నిర్మాణానికి నోచుకోని ఇళ్లను రద్దు చేసింది. ప్రారంభమైన ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకుంది. ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులు పేరిట బ్యాంకులలో రుణాలు తీసుకున్నారు. రుణాలు 85 శాతానికి పైగా మంజూరై ఏడాది గడిచినప్పటికీ ఇళ్ల నిర్మాణాలు మాత్రం పూర్తి చేయలేదు. లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించకుండానే రుణాలు చెల్లించాలని బ్యాంకులు ఒత్తిడి చేయడంతో పేదలు ఆందోళన చెందుతున్నారు.

**1095 ఇళ్ల నిర్మాణం**

మున్సిపాలిటీలో పేదల కోసం 1095 టిడ్కో ఇళ్లను నిర్మిస్తున్నారు. 28 బ్లాకుల్లో 300 చదరపు అడుగుల ఇళ్లు 1344 నిర్మిస్తున్నారు. 365 చదరపు అడుగులు ఇళ్లు ఒకే బ్లాకులో 48, 430 చదరపు అడుగుల ఇళ్లు ఆరు బ్లాకులలో 288 నిర్మిస్తున్నారు. 365, 430 చదరపు అడుగుల ఇళ్లకు 85శాతం రుణాలు మంజూరైనప్పటికి ఒక లబ్ధిదారునికి కూడా రిజిస్ట్రేషన్ చేయలేదు. లబ్ధిదారునికి రిజిస్ట్రేషన్ చేయకుండా రుణాలు చెల్లించాలని బ్యాంకులు మెసేజులు పంపించడంతో వారంతా భయాందోళన చెందుతున్నారు. 365, 430 చదరపు అడుగుల ఇళ్లు 336 ఉంటే 285 మందికి రుణాలు మంజూరయ్యాయి. ఒక్కరికీ రిజిస్ట్రేషన్ చేయలేదు. 300 చదరపు అడుగుల ఇళ్లు 1344 ఉంటే 1232మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ ఒక్కరికీ ఇళ్లు అప్పగించలేదు.



Dear Customer your loan a/c XXXX0058 is overdue by Rs. 29294.27 for 55 days. Plz pay overdue immediately to avoid penal interest Plz ignore if paid. PNB

8:16 AM • SIM 1

బకాయి ఉన్నట్టు బ్యాంకు నుంచి వచ్చిన మెసేజ్


**అద్దెలు చెల్లించుకోలేక అవస్థలు**

టిడ్కో ఇళ్లను ప్రభుత్వం పేదలకు అప్పగించకపోవడంతో అద్దె ఇళ్లల్లో నివాసముంటున్నారు. పట్టణంలో అద్దెలు పెరగడంతో భారంగా ఉందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని కోరుతున్నారు.

**బ్యాంకు మెసేజులతో ఆందోళన**

టిడ్కో ఇళ్ల కోసం బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు చెల్లించాలని ఏడాది నుంచి బ్యాంకులు లబ్ధిదారులకు మెసేజులు పంపిస్తున్నాయి. ఇళ్లను తమకు అప్పగించకుండా రుణాలు చెల్లించాలని మెసేజులు పంపిస్తే తాము ఎలా చెల్లించగలమని పేదలు ప్రశ్నిస్తున్నారు. బ్యాంకులకు రుణాలు చెల్లించకపోతే చక్రవడ్డీలు వేస్తే తాము భరించలేమని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇళ్లు అప్పగిస్తే తాము నివాసముండి అద్దె ఇల్లు ఖాళీ చేసి బ్యాంకులకు రుణాలు చెల్లించగలమని పేదలు చెబుతున్నారు. అద్దె ఇళ్లల్లో ఉంటూ బ్యాంకు రుణాలు ఎలా చెల్లించగలమని పేదలు ప్రశ్నిస్తున్నారు.

### ఇల్లు ఇవ్వకుండా ఎలా చెల్లిస్తాం?



టిడ్కో ఇల్లు అప్పగించకుండానే రుణం చెల్లించాలని బ్యాంకు నుంచి మెసేజులు వస్తున్నాయి. టిడ్కో ఇల్లు కోసం బ్యాంకు రుణం మంజూరు చేసింది. మాకు ప్రభుత్వం ఇల్లు అప్పగించకుండానే రుణం చెల్లించాలని మెసేజులు పంపిస్తే ఎలా చెల్లించగలం?. ప్రభుత్వం ఇంటి నిర్మాణం పూర్తి చేసి అప్పగించాలి.

– నవర వాణి, రెడ్డికవీధి, బొబ్బిలి

### వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు



టిడిపి హయాంలో మాకు టిడ్కో ఇల్లు మంజూరైంది. అప్పటిలో రూ.25 వేలు అప్పు చేసి డిపాజిట్ చేశాం. వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. డిపాజిట్ చెల్లించి ఐదేళ్ల గడిచినా మాకు ఇల్లు అప్పగించలేదు. ప్రభుత్వం స్పందించి ఇల్లు పూర్తి చేసి అప్పగించాలి.

– లొట్టి పద్మ, బొబ్బిలి

## 19న సామాజిక సమతా సంకల్ప సభ

ప్రజాశక్తి- వేపాడ

ఈ నెల 19న విజయవాడలో నిర్వహించనున్న సామాజిక సమతా సంకల్పం సభ (సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణ)ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సచివాలయం నుండి 7 గురు దళిత సామాజికవర్గ నాయకులను ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించిందన్నారు. వీరికి గాను వసతి, రవాణా సౌకర్యం నిమిత్తం ప్రతి 6 గ్రామ/వార్డు సచివాలయాలకు ఒక బస్సును ఏర్పాటు చేశామన్నారు. ప్రతి 6 సచివాలయాలను ఒక యూనిట్‌గా చేసుకొని ఇద్దరు పాయింట్ ఆఫ్ కాంటాక్ట్‌లను ఏర్పాటు చేశామన్నారు. 'సామాజిక న్యాయ మహా శిల్పం' ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా జెపి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- బొబ్బిలి

లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ జన్మదినోత్సవ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదరరావు పిల్లల మధ్య కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ 1996లో ఐఎఎస్‌కి రాజీనామా చేసి 1997లో లోక్ సత్తా ఉద్యమ సంస్థ, 2006లో లోక్‌సత్తా పార్టీని ప్రారంభించి ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు.

## రేపు కెఆర్ పేటలో జాతర

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కెఆర్‌పేటలో ఈనెల 16న శ్రీకృష్ణ రాయుడు స్వామినాయుడు జాతర వైభవంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఎడ్ల పరుగు పందేలు, చిన్నపిల్లలతో జానపద కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



గోదాదేవి కల్యాణం చేస్తున్న అర్చకులు

## రామతీర్థంలో గోదాదేవి కల్యాణం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామ స్వామి దేవస్థానంలో గోదాదేవి కళ్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా భోగి సందర్భంగా స్వామివారి ఉత్తర రాజ గోపురం పక్కన శ్రీలక్ష్మి నారాయణ స్వామి ఆలయం ముందర వైభవంగా భోగి కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం కాలక్షేప మండపం వద్ద సంక్రాంతి వేడుకలలో భాగంగా చిన్నపిల్లలకు భోగి పండ్లతో ఆశీర్వదించారు. దేవాలయం వెండి మందిరం వద్ద గోదాదేవి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవ స్థానం సహాయ కమిషనర్ బిహెచ్‌వియస్‌యన్ కిషోర్‌కుమార్, ఆలయ సీనియర్ సహాయకులు జూనియర్ సహాయకులు, అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్సీ సురేష్ బాబు

## సంప్రదాయాలు కొనసాగించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పాత సంప్రదాయాలు కొనసాగించాలని ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు అన్నారు. ఆదివారం మొయిదలో జరిగిన అన్నదాన కార్యక్రమలో ఆయన పాల్గొన్నారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి ఉదయం 4 గంటల నుంచి మేలుకొపుతో ఊరు మొత్తం తిరిగి భోగి రోజున అన్నదానం కార్యక్రమం చేపట్టడం 50ఏళ్ళు గా ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజల సమైక్యతను తెలియజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొయిద సర్పంచ్ అట్టాడ కృష్ణ, ఎంపిటిసి సంతోష్ బాబు, గ్రామ పెద్దలు కొండపల్లి సూర్యనారాయణ, యడ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మురుగు నీరు పారేదెలా.?

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాదిలో ఇంటింటికి తాగునీరు అందించే పథకం ద్వారా గొంప వారి వీధిలో పైపులు బిగించారు. కాలువలు కోసం తవ్వి తీసిన వేస్ట్ మెటీరియల్‌ను కాంట్రాక్టర్ తరలించకపోవడంతో ఇళ్లలో వాడుక నీరు పైకి పోకుండా నిలిచిపోతుంది. దీంతో దోమల పెరిగి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌కు తెలియపరిచి కాలువలో వేసినా వేస్ట్ మెటీరియల్ తరలించి వ్యాధుల బారి నుంచి ప్రజలను కాపాడాలని ఎంపిటిసి గొంప తులసీ కోరుతున్నారు.



అగ్ని ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, తహశీల్దార్

## అగ్ని ప్రమాదంలో ధాన్యం దగ్ధం

ప్రజాశక్తి- బొబ్బిలి

అగ్ని ప్రమాదంలో ధాన్యం దగ్ధమయ్యాయి. గొల్లపల్లి గ్రామానికి చెందిన రైతు బొబ్బాది కృష్ణ వరి నూర్పిడి చేసి 100 బస్తాల ధాన్యాన్ని పొలంలో నిల్వ చేశాడు. శనివారం రాత్రి నిల్వ చేసిన ధాన్యం బస్తాలు అగ్నికి ఆహుతవ్వడంతో రైతు బోరున విలపిస్తున్నాడు. పొలంలో ఉన్న ధాన్యాన్ని చూసేందుకు ఆదివారం తెల్లవారు జామున పొలానికి వెళ్లగా ధాన్యం బస్తాలు కాలిపోయి ఉండడంతో కన్నీటి పర్యంతమయ్యారు. గిట్టనివారు కావాలని ధాన్యానికి నిప్పు పెట్టి ఉంటారని గ్రామస్తులు భావిస్తున్నారు. కాలిపోయిన ధాన్యాన్ని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, తహశీల్దార్ డోల రాజేశ్వరరావు పరిశీలించారు. రైతుకు న్యాయం జరిగేలా చూడాలని తహశీల్దార్‌ను మున్సిపల్ చైర్మన్ మురళి కోరారు. పంట నష్టంపై అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తహశీల్దార్ రాజేశ్వరరావు చెప్పారు.

### రైతుకు ఆర్థిక సహాయం

**బొబ్బిలి:** అగ్నిప్రమాదంలో ధాన్యం కాలిపోయిన రైతు బొబ్బాది కృష్ణకు టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన ఆర్థిక సహాయం చేశారు. రైతును మానవత్వంతో ఆదుకోవాలని బేబినాయన కోరారు.



బాధితునికి నగదు అందిస్తున్న బేబినాయన

# రోజువారీ 'మార్కెట్' కష్టాలు

- ఏళ్లుగా వీడని ట్రాఫిక్ ఇబ్బందులు
- పట్టించుకోని పాలక వర్గం
- మార్కెట్ ఆదాయం పైనే పంచాయతీ శ్రద్ధ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు, ప్రజలు

ప్రజాశక్తి - జామి

ఒకప్పుడు వయా జామి మీదుగా వెళ్ళాలంటే బీమసింగి రైల్వే గేట్ సమస్య గుర్తొచ్చేది. దీంతో అక్కడ వంతెన నిర్మించి రైల్వే గేట్ సమస్యకు స్వస్తి పలికారు. కానీ జామి ప్రధాన రహదారికి మాత్రం రైల్వే గేటును మించిన సమస్య పట్టిపీడిస్తోంది. మండల కేంద్రంలో ప్రతి రోజూ ఉదయం 10 గంటల వరకు నిర్వహిస్తున్న రోజూ వారి మార్కెట్ నిర్వహణ, వాహన చోదకులకు, అత్యవసర పనులపై వెళ్లిన ప్రజానీకాన్ని ముప్పు తిప్పలు పెడుతుంది. గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం మామూలే కాదు. ప్రమాదకర పరిస్థితుల్లో వాహనాలు మార్కెట్‌ను దాటాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలోనే కష్టపడి పండించిన కాయగూరలు అమ్ముకోవడానికి రైతులు, రహదారి గుండా ప్రయాణం చేయాల్సిన ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఏటా మార్కెట్ ద్వారా లక్షల ఆదాయం పొందుతున్న పంచాయతీ అధికారులు, పాలక వర్గం మాత్రం మార్కెట్ నిర్వహణకు సురక్షితమైన స్థలం కేటాయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే చెప్పక తప్పదు. ఇప్పటికే అనేక మార్లు మార్కెట్ వ్యవహారంపై పంచాయతీకి ఫిర్యాదులు అందాయి. పత్రికల్లో పుంఖాను, పుంఖానా వార్తా కథనాలు వెలువడుతున్నాయి. కానీ పాలకుల్లో మాత్రం ఇసుమంతైనా చలనం లేకపోవడం దురదృష్టకరం.

జామి మేజరు పంచాయతీ రోజూ వారి మార్కెట్ నిర్వహణ ఏళ్లుగా వివాద స్పదంగా నడుస్తోంది. గతంలో గ్రామంలో వారపు సంత కేంద్రంగా మార్కెట్ నిర్వహణ జరిగేది. అయితే గతం కన్నా రైతాంగం పెద్దఎత్తున కాయగూరలు



ప్రధాన రహదారిలో రద్దీగా ఉన్న మార్కెట్

పంటలు విస్తృతం చేయడంతో జిల్లాలోనే రామభద్రపురం తర్వాత రెండవ కాయగూరలు పండించే ప్రాంతంగా జామి రైతాంగం గుర్తింపు పొందారు. అయితే పండించిన పంట అమ్ముకోవడానికి సరైన మార్కెట్ అవసరం. ఈ నేపథ్యంలోనే మండల కేంద్రంలో ప్రతి రోజూ మార్కెట్ నిర్వహిస్తున్నారు. ఈ మార్కెట్ నిర్వహణకు పంచాయతీకి లక్షల్లోనే ఆదాయం సమకూరుతుంది. కానీ మార్కెట్ నిర్వహణకు సరైన స్థలం ఏర్పాటు చేయడంలో పంచాయతీ విఫలమవుతోంది ని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రధాన రహదారిపైనే మార్కెట్ నడుస్తోంది. ఫలితంగా ట్రాఫిక్ కష్టాలు పెరిగిపోయాయి. ఇటీవల విశాఖ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులతో భారీ వాహనాలు రద్దీ ఎక్కువైంది. దీంతో మార్కెట్ నిర్వహణ ప్రమాదకరంగా మారింది. గంటల తరబడి ట్రాఫిక్ నిర్బంధం సంగతి అటుంచితే, ఏ వాహనం అదుపుతప్పి ప్రమాదం చోటు చేసుకుంటుందో అన్న భయాందోళన ఎక్కువైందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రమాదాలు కూడా తరుచూ జరుగుతున్నాయని చెబుతున్నారు. మరోవైపు అత్యవసర చికిత్సలు అందాల్సిన రోగులు 108 వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకొని నిలిచిపోతున్న పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించి ప్రధాన రహదారిపై ఉన్న మార్కెట్‌ను సరైన ప్రాంతానికి తరలించాలని ప్రయాణికులు, రైతులు కోరుతున్నారు.

### ఏళ్లుగా తాత్సారం

గతంలో ప్రజాశక్తి పలు మార్లు మార్కెట్ నిర్వహణకు స్థలం కేటాయించాలని కథనాలు ప్రచురించింది. దీంతో గతంలో మండల పెద్దల చొరవతో వారపు సంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, మార్కెట్‌కు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రణాళికలు రూపొందించారు. కానీ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా రోజు వారి మార్కెట్ నిర్వహణకు అటు రైతులు, ప్రజలకు అనువైన స్థలాన్ని ఏర్పాటు చేయాలని పెద్దఎత్తున ప్రజల నుంచి డిమాండ్ వినిపిస్తుంది.

# ధాన్యం.. దైన్యం.!

- దళారుల చెంతకే రైతులు
- అంతంత మాత్రంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న ఆర్‌బికెలు
- ప్రతి గింజనూ కొనుగోలు చేయాలన్న ప్రతిపాదన గాలికి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని 39 గ్రామ పంచాయతీలో 51 రెవెన్యూ గ్రామాలతో పాటు మరో 15 హేబిటేషన్ గ్రామాలు న్నాయి. 25 సచివాలయ పరిధిలో 22 రైతు భరోసా కేంద్రాలు న్నాయి. వాస్తవానికి రైతు పండించిన వరిని ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు అరకొరగానే చేస్తున్నట్లు తెలిస్తోంది. పైగా మిల్లర్లు దోపిడి పెరిగిపోవడంతో రైతు దిక్కుతోచక దళారుల వైపు మొగ్గు చూపుతున్నాడు. దీంతో దళారులు ఇష్టానుసారంగా రైతును దోచుకుంటున్నారు.

మండలంలో ఆర్‌బికెల ద్వారా సేకరించిన ధాన్యాన్ని నాలుగు రైస్ మిల్లర్లకు తరలిస్తున్నారు. దీంతో రైతులు వద్ద నుంచి మిల్లర్లు అదనంగా క్వింటాకు నాలుగు నుంచి పది కేజీలు రైతుల వద్ద నుంచి దోచేస్తున్నారు. దీంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఆరుగాలం శ్రమించి, తుఫాన్ ఒడిదుడుకులను తట్టుకొని వచ్చిన కొద్దిపాటి ధాన్యాన్ని సరైన రేటుకు అమ్ముకోలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి రాజాం, చీపురుపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పాలకొండ పట్టణాలకు లారీలు, ట్రాక్టర్లతో ఎగుమతి చేస్తున్నారు. దీంతో దళారులకు ధాన్యం



తరలింపునకు దళారులు సిద్ధం చేసిన ట్రాక్టర్

వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా మారింది.

### హామీలు మాటలకే పరిమితం

ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు రైతు భరోసా కేంద్రాలలో ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని, రంగు మారిన ధాన్యాన్ని కూడా ఆంక్షలు లేకుండా కొనుగోలు చేస్తామని ఊక దంపుడు ప్రసంగాలు చేశారు. ఆ దిశగా క్షేత్రస్థాయి అధికారులు కొనుగోలు చేయకపోవడంతో రైతు ఏమి చేయని పరిస్థితిలో డీలాపడ్డాడు. ఇప్పటికే 40శాతం రైతు భరోసా కేంద్రాలు కొనుగోలు చేస్తుంటే, మరో 50 శాతం దళారుల చెంతనే ధాన్యం కొనుగోలు జరుగుతున్నాయని రైతులు విమర్శిస్తున్నారు. దళారులు కూడా క్వింటాకు 4 కేజీలు అదనంగా తీసుకుంటు న్నారని చెబుతున్నారు. అయితే దళారులు వారం రోజుల్లో ధాన్యం డబ్బులు చెల్లిస్తున్నారని ప్రభుత్వానికి ఇస్తే సుమారు మూడు వారాలు పడుతుందని ఇప్పటికీ చాలా మంది డబ్బులు అందలేదనే ఆలోచనతో కూడా దళారులకు ఇచేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

### కౌలు రైతులకు ఇంకా నష్టం

వాస్తవానికి చాలా మంది కౌలు రైతులు భూయజమాని వద్ద ఎకరానికి 12 నుంచి 14 బస్తాల వరకు ఇస్తామని భూమిని కౌలుకు తీసుకున్నారు. తుపాను ప్రభావం, మదుపులు పెరిగిపోయాయి. పైగా దిగిబడి తగ్గిపోయింది. ఇప్పుడు ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేయకపోవడం, ఒకవేళ ధాన్యం కొనుగోలు చేసినా మిల్లర్లు అదనంగా ధాన్యం తీసుకోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చాలా మంది కౌలు రైతులు కూడా దళారులకే ధాన్యాన్ని అమ్మేస్తున్నారు. దళారులు ప్రభుత్వం ధర కన్నా క్వింటాకు రూ.200 నుంచి రూ.300 తక్కువకు తీసుకుంటున్నారు. దీంతో అప్పుల పాలవుతున్నామని కౌలు రైతులు కంటతడి పెడుతున్నారు. ప్రభుత్వ అధికారులు చొరవ చూపి భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి ఆదుకోవాలని, అదనంగా వసూలు చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



జిఒ ప్రతులను మంటల్లో వేస్తున్న విజయగౌరి

## హామీలు అమలు చేయాలి

**బొబ్బిలి:** ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండడంతో యుటిఎఫ్ ఆధ్వర్యంలో మల్లమ్మపేట, రత్నాలనగర్, రావువారివీధిలో భోగి మంటల్లో హామీ ప్రతులను వేసి ఆదివారం దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేసి ప్రతినెల ఒకటికి వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, బి.రమేష్, రామకృష్ణ, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల భోగి సంబరాలు

**గజపతినగరం:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాల క్రీడా మైదానంలో భోగి సంబరాలు వేడుకగా జరిగాయి. గత 21 సంవత్సరాలుగా ఏటా నిర్వహిస్తూ వస్తున్న భోగి సంబరాలను ఈ ఏడాది కూడా పూర్వ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాలు, దేశాల్లో ఉద్యోగరీత్యా ఉంటున్న సీనియర్, జూనియర్ పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆదివారం భోగి సంబరాలకు హాజరు కావడంతో సందడి వాతావరణం నెలకొంది. ప్రతి బ్యాచ్ తమ తమ క్లాస్మేట్స్‌ని ఆప్యాయంగా పలకరించుకుంటూ, ఆనాటి పాఠశాల రోజులను గుర్తు చేసుకుంటూ పరవశించిపోయారు. తమ పిల్లలతో పాటు హాజరైన పూర్వ విద్యార్థులు భోగి మంట చుట్టూ ఆటపాటలతో గడిపి ఆనందభరతులయ్యారు. అనంతరం పదిమంది నారాయణలకు అమృత కలశాలను, దుప్పట్లు పంపిణీ చేశారు.

# లోపల అసంపూర్తి పనులు.. పైకి మెరుగులు..

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో పలు విద్యాసంస్థల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. పాఠశాలల నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదనపు గదులు మంజూరుకు రెండో విడత నాడు నేడు నిధులను మంజూరు చేసినట్లు ప్రకటించారు. నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిపివేశారు. సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు టాయిలెట్స్, ప్రధాన గేటు నిర్మాణానికి నిధులు పూర్తిగా మంజూరు చేయకపోవడంతో మధ్యలోనే పనులు నిలిపివేశారు. వావిలిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలకు రెండో విడత నిధులు మంజూరు చేశారు. వీటికి కూడా చేసిన పనులకు నిధులు పూర్తిగా మంజూరు



మధ్యలో నిలిచిపోయిన కెజిబివి పాఠశాల నిర్మాణం

చేయకపోవడంతో మధ్యలోనే పనులు నిలిపివేశారు. బికెఎస్ పేట వద్ద గల కెజిబివి వసతి గృహంలో అదనపు గదులు నిర్మాణానికి రెండో విడత నిధులు పూర్తిస్థాయిలో విడుదల కాకపోవడంతో పిల్లర్స్ వేసి పనులు ఆపేశారు. కేజీబీవీలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు భవన నిర్మాణానికి సర్వ శిక్ష అభియాన్ నుంచి నిధులు మంజూరు చేసి సుమారు మూడు సంవత్సరాలు కావస్తున్న నిర్మాణ పనులు పూర్తి కాలేదు. స్లాబ్ వేసి, లోపల ప్లాస్టింగులు, వైరింగులు, గచ్చులు మాత్రం చేయలేదు. పైన మాత్రం భవనం పూర్తి చేసినట్లు రంగులు వేశారు. నేటికీ రెండున్నర సంవత్సరాలు నుంచి విద్యార్థులు ఇరుకు గదుల్లోనే ఇబ్బందులు పడుతూ విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. సంబంధిత జిల్లా స్థాయి అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మధ్యలో నిలిచిపోయిన పాఠశాలల అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

# భోగి మంటల్లో 1,2,77 జిఒలు దహనం

ప్రజాశక్తి- విజయనగరం కోట

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రజా వ్యతిరేక జిఒలు 1,2,77లను టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి అధితి గజపతిరాజు ఆదివారం దగ్ధం చేశారు. అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో భోగి మంటలు వేసి జిఒ కాపీలను అందులో వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగంలో ఉన్న ప్రజా స్వేచ్చను హరించడానికి ప్రభుత్వం అనేక జీవోలను తీసుకువచ్చి ప్రజలకు ఆటంకాలు ఏర్పరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, రాష్ట్ర బీసీ నాయకులు వేచలపు శ్రీనివాసరావు, విజ్జపు ప్రసాద్, కొండ్రు శ్రీనివాసరావు,పైడిరాజు, నియోజకవర్గ టిడిపి నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.



జిఒ కాపీలను మంటల్లో వేస్తున్న అదితిగజపతిరాజు

**విజయనగరం టౌన్ :** నగరంలోని మంగళవీధిలో జనసేన నేత గురాన అయ్యలు ఆధ్వర్యాన భోగి మంటల్లో ప్రజా వ్యతిరేక జిఒ కాపీలను వేసి దహనం చేశారు. కార్యక్రమంలో జనసైనికులు వజ్రపు నవీన్ కుమార్, ఏంటి రాజేష్, ఎం.పవన్ కుమార్, అడబాల వెంకటేష్‌నాయుడు, పృథ్వీభార్గవ్, వెంకటేష్, కంది సురేష్, కర్రోతు అప్పలనాయుడు, హిమంత్, వెంకటరమణ పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ విజేత బైరెడ్డిపాలెం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని దల్లిపేట గ్రామం వద్ద నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో బైరెడ్డిపాలెం గ్రామం విజేతగా నిలిచింది. దల్లిపేట గ్రామానికి చెందిన కిలము శ్రీను ఇటీవలి మృతి చెందాడు. ఆ యువకుడు జ్ఞాప కార్థం ఆయన స్నేహితులు దల్లిపేట లవ్లీ యూత్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. టోర్నమెంట్‌లో 26 జట్లు పాల్గొనగా దల్లిపేట, బైరెడ్డిపాలెం జట్లు ఫైన ల్‌కు చేరుకున్నాయి. ఇందులో బైరెడ్డిపాలెం విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన బైరెడ్డిపాలెం జట్టుకు రూ.20 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన దల్లి పేట జట్టుకు రూ.10వేలు నగదును సచివాలయాల మండల జెసిఎస్ కన్వీనర్ బైరెడ్డి యర్రప్పల నారాయణ చేతుల మీదుగా అందించారు.



భోగాపురం: విజేత జట్టు

### ముగిసిన ప్రీమియర్ లీగ్

**శృంగవరపుకోట:** పట్టణంలోని ఆకుల డిపో వద్ద గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్‌పిఎల్ క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్స్‌లో గెలుపొందిన విజేతలకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ నగదు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో ప్లేయర్ అఫ్ ది సిరీస్‌గా గేదెల విజయ్ కుమార్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా గోపిశెట్టి సాయి కుమార్, బెస్ట్‌బౌలర్‌గా డొంకాడ ఈశ్వరరావు (రైనా ) ఎంపికయ్యారు. లీగ్‌లో విజేత జట్టు యశ్వంత్-11కు రూ.50వేలు, రన్నరప్ జట్టు సింగపూర్ హార్సెస్‌కు రూ.35వేలను గొంప కృష్ణ అందించారు.

# టిబి రోగులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - జామి

మండలంలోని బీమసింగిలో టీబీతో బాధపడుతున్న రోగులకు గ్రామ సర్పంచ్ జొన్నాడ వెంకటలక్ష్మి, వైసిపి నాయకుడు సత్యన్నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం పౌష్టికాహారం అందజేశారు. బోగి పర్వదినాన గ్రామంలో రోగులను గుర్తించి వారికి కేజీ కజ్జూరమ్, కేజీ వేరుశనగ పలుకులు, కేజీ కందిపప్పు, కేజీ కొమ్ము శనగలు, బెల్లం, గుడ్లు అందజేశారు. కార్యక్రమంలో పెద్దలు, యువత పాల్గొన్నారు.

### పేదలకు దుస్తులు పంపిణీ

**డెంకాడ:** గుండాలపేట గ్రామంలో బుగత



డెంకాడ: నిత్యావసరాలు అందిస్తున్న రమణ

రమణ తండ్రి సూరి జ్ఞాపకార్థం ఆదివారం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం యువతకు క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నెల్లిమర్ల ఎమ్మెల్యే తనయుడు మనదీప్ హాజరై పేదలకు దుస్తులను పంపిణీ చేయగా విజేతలకు బహుమతులను అందజేశారు.

### పేదలకు నిత్యావసరలు

మండలంలోని పినతాడివాడలో సంక్రాంతి సందర్భంగా జిల్లా టిడిపి యాదవ సంఘం అధ్యక్షుడు కోర్నాన ఆదిబాబు పేదలకు నిత్యవసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. గ్రామంలో సుమారు 150మంది పేదలకు, వృద్ధులకు పండగ సందర్భంగా 10 కేజీల బియ్యం, కందిపప్పు, శనగపప్పు, పెసర పప్పు, నూనె, బెల్లం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఝాన్సీ నియామకంపై హర్షం

ప్రజాశక్తి- కొత్తవలస

బొత్స ఝాన్సీలక్ష్మిని ఎంపి అభ్యర్థిగా నియమించడం హర్షణీయమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కొత్తవలసలో ఆయన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా నియోజకవర్గం ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. బొత్స ఝాన్సీలక్ష్మిని విశాఖ పార్లమెంట్ అభ్యర్థిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇటువంటి విద్యావేత్తని తమ పార్లమెంట్ అభ్యర్థిగా రావడం నియోజకవర్గం ప్రజలందరూ చేసుకున్న గొప్ప అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆవిడ గొప్పతనం, అర్హత కోసం మాట్లాడుకోవాలంటే ఒక పేజీ ఉంటుందని కొనియాడారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, డిసిసిబి చైర్మన్ వెచలపు చినరామునాయుడు, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, గొర్లె రవి, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, ఎల్‌కోట ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, జెసిఎస్ ఇన్‌ఛార్జ్‌లు బొంతల వెంకటరావు, వాకాడా సతీష్, జామి వైస్ ఎంపిపి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

### ఝాన్సీకి ఎమ్మెల్యే అభినందనలు

**బొబ్బిలి:** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విశాఖపట్నం ఎంపి అభ్యర్థిగా బొత్స ఝాన్సీని నియమించిన సందర్భంగా ఆదివారం బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

# ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీలలో విజేతలకు ఆదివారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పుణ్యగిరి కళాశాల వద్ద నియోజకవర్గ స్థాయి ముగ్గులు పోటీలు నిర్వహించామన్నారు. శనివారం జరిగిన మండల స్థాయి పోటీలో మొదటి ఐదు స్థానాల్లో విజేతలుగా నిలిచిన 25 మంది నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొన్నారన్నారు. అందులో గెలిపొందిన విజేతలకు ఆయన చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి ఇమంది అనూష (లక్కవరపుకోట) రూ.20 వేలు, రెండో బహుమతి చలమూరి చిట్టితల్లి (వేపాడ) రూ.15 వేలు, మూడో బహుమతి కటకం జితేంద్ర కళ్యాణి (జామి) రూ.10 వేలు, నాలుగ, ఐదు బహుమతులును కర్రి కళ్యాణి (కొత్తవలస), కొట్యడా గోవర్ధిని (వేపాడ)లకు చెరో రూ. 5 వేలు చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో జామి, కొత్తవలస, వేపాడ టిడిపి మండల అధ్యక్షులు లగుడు రవి కుమార్, గొరపల్లి రాము, గొంప వెంకటరావు, నాయకులు రాయవరపు చంద్రశేఖర్, రెడ్డి పైడి బాబు, గుమ్మడి భారతి, జుత్తాడ రామసత్యం, ఇప్పాక త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

### జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**భోగాపురం:** భోగాపురం గ్రామంలో జనసేన ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ముగ్గుల పోటీలు నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇంఛార్జి లోకం మాధవి మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించారు. చక్కగా ముగ్గులు వేసిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులను అందజేశారు. సుమారు 50 మంది మహిళలు ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లోకం ప్రసాద్, స్థానిక నాయకులు పల్లంట్ల జగదీష్, పళ్ళ రాంబాబు, బొల్లు త్రినాథ్, మాత నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌కోట: విజేతలకు బహుమతులు అందిస్తున్న గొంప కృష్ణ తదితరులు



జనంతో కిక్కిరిసిన మార్కెట్

## మార్కెట్ కిటకిట

**బొబ్బిలి:** జనంతో మార్కెట్ కిటకిటలాడింది. సంక్రాంతి బట్టలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జనం పట్టణానికి చేరుకోవడంతో పట్టణ రహదారులన్నీ ఆదివారం జనంతో కిటకిటలాడాయి. మార్కెట్ రోడ్డు జనంతో కిక్కిరిసింది. అధిక సంఖ్యలో జనం మార్కెట్‌కు రావడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.